



మొదటి రోజు ఒక్క ఆర్డర్ కూడా రాలేదు. రెండోరోజు ముప్పై వరకూ వచ్చాయి. క్రమంగా ట్రాఫిక్ పెరిగింది. వ్యాపారం అధికమైంది. ఆ తర్వాత స్విగ్గీని దేశమంతా విస్తరించారు. రెస్టారెంట్ వరకు వెళ్లాల్సిన పన్లేదు. టేబుల్ వెతుక్కోవాల్సిన బాధ లేదు. వెయిటర్ కోసం వెయిట్ చేయాల్సిన తలనొప్పి లేదు. ఒక్క క్లిక్ చాలు. కోరిన రుచులు కాలింగ్‌బెల్ నొక్కేస్తాయి. స్విగ్గీ ఓ రుచుల విప్లవం. ప్రతి ఆంత్రప్రెన్యూర్‌నూ చిటారు కొమ్మన మిఠాయి స్వప్నంలాంటి ఓ ఆశ ఊరిస్తూనే ఉంటుంది. ఆ ఐపీవో స్వప్నాన్ని నిజం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు హర్ష, నందన్. వందకోట్ల డాలర్ల సేకరణ ఆ ఇద్దరి లక్ష్యం.



కన్నవాళ్లు తమ కోసం తాము ఖర్చు పెట్టుకోరు కానీ, తమ పిల్లల కోసం ఎంతైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉంటారు. నాణ్యత విషయంలో రాజీ పడరు. ఫస్ట్‌క్రై విజయ రహస్యం కూడా అదే. ఇక పబ్లిక్ ఇష్యూ అనేది ఏ సంస్థకైనా ఓ మైలురాయి.

**- శుభం మహేశ్వరి**
వ్యవస్థాపకుడు, ఫస్ట్ క్రై

### హలో.. ఓలా!

అమ్మ, నాన్న ముంబైలో పెద్ద డాక్టర్లు. చిన్నప్పుడే భవిష్ అగర్వాల్ బుర్రలో ఐఐటీ స్వప్నాన్ని ఇన్‌స్టాల్ చేశారు. కానీ మొదటి ప్రయత్నంలో సక్సెస్ కాలేకపోయాడు ఆ కుర్రాడు. దీంతో భవిష్ భవిష్యత్తు అగమ్యంగా మారింది. నిరాశలో కూరుకుపోయాడు. తల్లిదండ్రులు బిడ్డకు ధైర్యం నూరిపోశారు. భవిష్యత్తు నీదే నంటూ భరోసా కల్పించారు. ఆ మనోధైర్యంతో మరుసటి ఏడాది ఐఐటీ-ముంబైలో సీటు సాధించాడు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో మైక్రోసాఫ్ట్ కొలువు వరించింది. సినిమాలు, షికార్లు, వీకెండ్ ట్రిప్స్.. ఎక్కడికి బయల్దేరినా ట్యాక్సీ సమయానికి వచ్చేది కాదు. వచ్చినా తరచూ తలపొగరు డ్రైవర్లు తగిలేవారు. దీంతో వీకెండ్ మూడ్ మొత్తం ఖరాబైపోయేది. ఇది తన ఒక్కడి సమస్యే కాదనిపించింది. అప్పుడు వచ్చిన ఆలోచనే ఓలా. ఐఐటీలో సీనియర్ అంకిత్ భాటి ఆ ప్రయత్నంలో భాగస్వామి అయ్యాడు. తొలిరోజుల్లో అన్నీ కష్టాలే, జేబుకు చిల్లులు పెట్టే అనుభవాలే. అయినా ఆ మిత్రులు నిరాశపడలేదు. ఓపికతో వ్యవహరించారు. ఓలాను తిరుగులేని సంస్థగా తీర్చిదిద్దారు. అక్కడితో ఆగిపోతే.. ఆంత్రప్రెన్యూర్‌షిప్‌కు అర్థమేం ఉంటుంది. 'ఓలా ఎలక్ట్రిక్' పేరుతో కాలుష్య రహిత వాహనాల తయారీ రంగంలోకి వచ్చారు. అతితక్కువ కాలంలోనే ఓలా ఈవీ స్కూటర్ బ్రాండ్‌గా ఎదిగింది. సమీప ప్రత్యర్థి 'హీరో'ను వెనక్కినెట్టి అసలైన హీరోగా నిలిచింది. సంప్రదాయ డీలర్‌షిప్ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా.. ఆన్‌లైన్‌లో బండి బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. డిజైన్ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. అత్యాధునికమైన తయారీ యూనిట్ ఓలా ఎలక్ట్రిక్‌కు మూలస్తంభం లాంటిది. 'ఇంధనాలతో నడిచే వాహనాలకు కాలం చెల్లింది. ఎలక్ట్రిక్ బండ్లదే రాజ్యం. ఐపీవో ద్వారా సేకరించే నిధులతో వ్యాపారాన్ని మరింత విస్తరిస్తాం. అయినా, భారత్‌కే ఎందుకు పరిమితం కావాలి?' అంటున్నాడు భవిష్ అగర్వాల్.

### సై అంటే సై..

క్రెడిట్‌కార్డుతో మహా అయితే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ షాపింగ్ చేసుకుంటాం. కానీ, అంతకుమించిన ఆప్షన్స్ ఉన్నాయంటూ 'కమర్షియల్ క్రెడిట్ కార్డ్స్' వ్యవస్థకు ఊతమిచ్చింది 'పేమేట్'. ఇదొక మొబైల్ బేస్డ్ డిజిటల్ పేమెంట్ ప్లాట్‌ఫామ్. దీని వ్యవస్థాపకులు అజయ్ ఆదిశేషన్, విశ్వనాథన్ సుబ్రమణియన్. ఈ మనీ మెజీషియన్ల ఐపీవో కల ఈ ఏడాది నెరవేరే ఆస్కారం ఉంది. మొబైల్ వ్యాలెట్ అంటే ఏమిటో కూడా జనానికి తెలియని రోజుల్లోనే గుర్‌గ్రామ్ కేంద్రంగా 'మొబీక్విక్'కు రూపం ఇచ్చారు బిపిన్‌ప్రీత్ సింగ్, ఉపాసనా టాకు. అంతేకాదు, తన కస్టమర్లకు తక్షణ రుణాలూ మంజూరు చేస్తుంది. బీమా సేవలనూ అందిస్తున్నది. డిస్కౌంట్‌లు, ఆఫర్లు ఉండనే ఉంటాయి. 'ఆర్థిక విషయాల్లో ఇదో ఆత్మీయ నేస్తం' అంటాడు బిపిన్. తను ఐఐటీ ఢిల్లీ పూర్వ విద్యార్థి. 'జనాగ్రహ' అనే ఎన్జీవోలో చురుకైన పాత్ర పోషిస్తున్నాడు. ఉపాసన స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్. ఈ సంస్థ తక్షణ గురి.. ఐపీవో. బ్రేక్‌ఫాస్ట్ నుంచి సెలూన్ సేవల వరకూ సర్వమూ గడప దగ్గరికే వస్తున్నప్పుడు, వైద్య సేవల కోసం మాత్రం దవాఖానలు, ల్యాబ్‌ల చుట్టూ తిరగాల్సిన అవసరం ఏమిటి? అనే ప్రశ్న ఓ స్టార్టప్ ఆవిర్భావానికి కారణమైంది. అలా ప్రశ్నించిన వ్యక్తి మీనా గణేశ్. అప్పుడు ఆవిర్భవించిన సంస్థ.. పోర్టీ. ప్రాథమిక ఆరోగ్య సేవల్ని మరింత నాణ్యంగా, ఇంకొంత చౌకగా అందించాలన్నదే తమ లక్ష్యమని చెబుతారు మీనా. ఆరుపదుల వయసులోనూ అలసట తెలియని సీరియల్ ఆంత్రప్రెన్యూర్ ఆమె. కాలు మోపిన ప్రతి రంగంలోనూ ఘన విజయం సాధించారు. దీంతో ఆమె నేతృత్వంలో రానున్న ఐపీవోపై కూడా మదుపర్లు పెద్ద ఆశలే పెట్టుకున్నారు. అజయ్ ఆదిశేషన్.. సీరియల్ ఆంత్రప్రెన్యూర్. కలలు కనడం. ఐడియాలు సృష్టించడం. వాటికి రూపం ఇవ్వడం. ఆ సంస్థను ఏ బహుళజాతి సంస్థకో విక్రయించడం.. అతని వ్యాపారం. ఆ వరుసలోని ఒకానొక కంపెనీ.. పేమేట్ ఇండియా. ఇదొక బిజినెస్ టు బిజినెస్ వ్యాపార సంస్థ. వ్యాపార విస్తరణకు ఐపీవో ప్రణాళికలు రచిస్తున్నది.

* * *

ప్రతి సంస్థ ప్రయాణమూ సినిమా కథంత ఉత్కంఠ భరితం. అనేకానేక మలుపులు, చిన్నాపెద్ద కష్టాలు, ఒకరిద్దరు వ్యవస్థాపకుల జీవితాల్లో రొమాంటిక్ కోణాలు.. బోలెడంత మసాలా! ఆ తళుకు బెళుకుల వెనుక చీకట్లు కూడా ఉన్నాయి. ఉదాహరణకు ఓ పన్నెండు కంపెనీలను తీసుకుంటే.. అందులో ఎనిమిది వరకూ దినదినగండంగానే నడుస్తున్నాయి. వాటి వార్షిక నష్టాలు ఎనిమిదివేల కోట్ల రూపాయల పైచిలుకు. ఫస్ట్‌క్రై, మొబీక్విక్, ఓలా ఎలక్ట్రిక్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. మిగిలినవాటి ఆర్థిక చరిత్ర కూడా ఏమంత ఘనంగా లేదు. కాకపోతే, భవిష్యత్తు మాత్రం ఆశాజనకంగా కనిపిస్తున్నది. నిజమే, ప్రతి విజయం ఓ కలగానే మొదలవుతుంది. ఏదో ఒకరోజు వాస్తవ రూపం ధరిస్తుంది. బరిలో వంద పందెం కోళ్లు ఉండొచ్చు. అందులో విజేతగా నిలిచేది ఒకటే. అయితేనేం.. మరో సంక్రాంతి రానే వస్తుంది. గెలిచే అవకాశాన్ని మోసుకొస్తుంది. ఏ స్టార్టప్‌కు అయినా ఆశావాదమే అంతులేని ఆస్తి. ఐపీవో రూపంలో అందేది బోనస్ మాత్రమే. పండగ ముగ్గేస్తున్న పడతి చుక్కల్ని కలుపుకొంటూ పోయినట్టు.. జీవితాన్ని, వ్యాపారాన్ని నిర్మించుకోవాలి. ఇదే సంక్రాంతి సందేశం. ■